# "మన వాళ్ళుత్తి..."

డాక్టర్ కర్రి శివాజీ

"ప్లీజ్ కమిన్ పట్టాభీ!" కారు విండోలోంచి తల బయటకు పెట్టి ఆహ్వానించాడు అమరేంద్ర. పట్టాభి కారు ముందునుంచి నడచి వెళ్ళి అమరేంద్ర పక్కన కూర్చుంటూ చెప్పాడు–

"థాంక్స్!"

కారు చిన్న కుదుపుతో ముందుకు కదిలింది.

"మీ రిసెర్చ్ ఎంతవరకూ వచ్చింది?" అమరేంద్ర అడిగాడు.

పట్టాభి మొహం మీద చిన్న నవ్వు వెలిసింది.

"పూర్తి కావొచ్చింది. ఇంకా రెండు నెలలు అంతే"

కారుని ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆపుతూ అడిగాడు అమరేంద్ర–


"మీరు గ్రేడ్ టు సైంటిస్టుగా ఎంత అందుకుంటున్నారు?"

"రెండు వేల అయిదువందల వరకూ! " కారు కదుల్తూ మలుపు తీసుకుంది.

"పట్టాభీ ఎన్నాళ్ళీ జీవితం! మీకెప్పుడూ అన్పించలేదూ 'నేనూ సంపాదించాలి. అందరి లాగే నేనూ లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యాలి' అని! మీకొచ్చే జీతంతో ఈ సిటీలో ఈ అత్తెసరు బతుకు మీకెప్పుడూ రోత కల్గించలేదా?"

పట్టాభికి 'మోపెడ్ కొనుక్కుంటాను డాడీ' అని కూతురు అడిగినప్పుడు, తను తప్పించుకోవడానికి కష్టపడిన సంఘటన గుర్తొచ్చింది.

"వీడేమిటూ నన్నిలా కార్లో కూర్చోపెట్టి నీతులు చెబుతున్నాడు అనుకోవద్దు. ఒక్కసారి ఆలోచించండి. నేను మీకంటె చిన్నవాడిని. మీ అంతే చదువుకున్నాను కానీ నాకొక కారు, ఓ



బంగాళా, ఓ అందమైన జీవితం. ఉన్నాయి. మీరు ఇన్నాళ్ళు ఇక్కడ సైంటిస్టుగా ఉండి ఏం సాధించగలిగారు... గౌరవం తప్ప. వీళ్ళెవరూ రిటైర్ అయిన తర్వాత మీ మొహం చూడరు, మీకు స్టేట్స్‌లో ఎన్నో యూనివర్శిటీలు ప్రొఫెసర్‌షిప్ ఆఫర్ చేస్తున్నాయి. గల్ఫ్ దేశాలన్నీ మీ సర్వీసెస్ కోసం కాచుకొని ఉన్నాయి.... ఎందుకీ లైఫ్ పట్టాభీ, మిమ్మల్ని గుర్తించని దేశాన్ని పట్టుకొని మీరు మాత్రం ఎందుకు పాకులాడటం?"

"అమరేంద్ర! కారాపుతారా!" పట్టాభి నెమ్మదిగా అన్నాడు.

"థాంక్స్ ఫర్ యువర్ సజెషన్స్! నేనేమిటో, నాకేమిటి కావాలో నాకు బాగా తెలుసు. నేనేదీ ప్రతిఫలం ఆశించి చెయ్యలేదు. నా వంతుగా నా దేశానికి ఏదో ఒకటి ఇవ్వాలని అంతే..... నా రిసెర్చ్ పూర్తయి ఆ రెండు పైసల టాబ్లెట్ మార్కెట్‌లోకి విడుదలయితే కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదా అవుతాయి. మరి అదంతా నా దేశానికి నేను సంపాదించి పెట్టినట్లే కదా! నా మాటలు మీకు నవ్వు కల్గించొచ్చు - ఎవడి పిచ్చి వాడికానందం, కానివ్వండి. రేపట్నుంచి దయచేసి బస్టాండులో నా కోసం కారాపకండి. నా కాన్షస్‌ని అదే అంతరాత్మ అంటారు కదా, దాన్ని కొద్దిగా నైన నొప్పించడం నా కిష్టం ఉండదు!"

"నా మాటలు తప్పుగా అనిపిస్తే క్షమించండి. విష్‌యూ ఎ వీ సక్సెస్ పట్టాభీ!" మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెప్పాడు అమరేంద్ర.

* * * *

"ఎస్ ఫైనాన్షియల్ సెక్రటరీ నిశాంత్ ముఖర్జీ స్పీకింగ్"

'గుడ్మార్నింగ్ సర్! నేను నిరోధ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌ని మాట్లాడుతున్నాను".....



# అమర్ ఖయ్యామ్

అంబర మంబితంబులు మహా గిరులున్, సువిశాలముల్ సము
ద్రంబులు, పొంగి పారెడు తరంగిణులున్, ఫలపుష్పపత్ర పూ
ర్ణంబులు చె, ట్లనంత గగనంబును దేవుని యున్కి దెల్పని
త్యంబు నిదర్శనంబులు; ప్రదర్శనముల్ పరమాత్మ శక్తికిన్.

తెలతెల వారు వేళ; తెర తీయగ తీయగ పక్షిసంతతుల్
కలకల కూయువేళ పయి గ్రమ్మిన మబ్బులు వాన చిన్కులన్
జలజల రాల్చువేళ, సహజమ్ముగ స్వప్నములో స్తనందయుల్
కిలకిల నవ్వువేళ, తిలకింతును నీ సొగసుల్ జగత్ప్రభూ!

పాత్ర ధారులమై కళా క్షేత్రమందు
అడుగు తడబడకుండ మే మభినయింప
సూత్రధారువై పైన జూచుచున్న
ఓ జగన్నాట్య సందర్శకా! జయోస్తు!

ఈ విశాల వినీలాంబరావధికము
పట కుటీరమ్ము నాకీ ప్రపంచ మెల్ల;
ఈ గుడారమ్ములో విహరించు యుష్మ
దీయ రాజ్య వినోదయాత్రికుడ నేను!

డాక్టర్ కరుణశ్రీ "అమర్ ఖయ్యామ్" పద్యకావ్యం నుంచి

ప్రొఫెసర్ పట్టాభి సీతారామ శాస్త్రి చేస్తున్న రీసెర్చ్ గురించి విన్నారా?"

"ప్రొద్దునే ఆ విషయం ఎందుకండీ"

వాళ్ళ సంభాషణ స్వచ్ఛమైన ఇంగ్లీషులో సాగుతోంది.

"అతనిరీసెర్చ్ ఫలవంతమయితేమా కండోమ్స్ కంపెనీలన్నీ శాశ్వతంగా మూసెయ్యాలి."

"వ్వాట్!!"

"అవును, సెక్సు చివరి దశలో వీర్యంతో పాటు కొద్దిగా మూత్రం విడుదలయ్యేందుకు అతి చవకలో టాబ్లెట్ రూపొందించబోతున్నాడు పట్టాభి. మూత్రంతో కలిసిన తర్వాత వీర్య కణాలన్నీ చచ్చిపోతాయి, ఇక ప్రజలకి కుటుంబ నియంత్రణ కోసం నిరోధ్ లాంటి తొడుగుల అవసరమే ఉండదు!"

నిశాంత్ ముఖర్జీ కొద్ది నిముషాలు మౌనంగా ఉండి తర్వాత ఫోను పెట్టేసాడు. ప్రభుత్వానికి మిగిలిపో బోయే కోట్ల రూపాయల గురించి ఆలోచించడం లేదతడు. అటువంటి కంపెనీలు ఇంకా అయిదు ఉన్నాయి, అవి మూతపడితే వాళ్ళు ప్రతి ఏటా బహుమతుల రూపేణా తనకి సమర్పించుకొనే లక్షల రూపాయల నష్టం గురించి కూడా 'పెద్దగా' ఆలోచించడం లేదు. తన తమ్ముడు "ప్రదీప్ ముఖర్జీ"ఇదే విషయం మీద ఇలాంటి డ్రగ్ రూపొందించడం మీద చేస్తున్న రీసెర్చ్ గురించి ఆలోచిస్తున్నాడు. తను కనుక్కోవాలనుకున్న మందుని తన కంపె ముందుగా- ఆఫ్టరాల్ ఓ తెలుగువాడు-రూపొందిస్తే తన తమ్ముడి మొహంలో ద్యోతకమయ్యే నిరాశ, నిరుత్సాహం గురించి ఆలోచిస్తున్నాడు.. ముఖ్యంగా ఓ తెలుగువాడికి దక్క బోయే అపార గౌరవం గురించి ఆలోచిస్తున్నాడు.

బస్టాండులో నిల్చొని కారాపమని చెయ్యూపుతున్న పట్టాభిని చూసి ఆశ్చర్యపోయాడు అమరేంద్ర.

"నేను వచ్చేవారం స్టేట్స్ వెళ్ళిపోతున్నాను" కార్లో కూర్చుంటూ చెప్పాడు పట్టాభి.

అమరేంద్ర నిర్ఘాంతపోయాడు.

"జోక్ చేస్తున్నారా?"

"కాదు, సీరియస్‌గానే చెప్తున్నాను అమరేంద్రా! ఈ ప్రజలు నన్ను గుర్తించలేదే, ఈ ప్రభుత్వం నన్ను పట్టించుకోలేదే అని నేనెప్పుడూ బాధ పడలేదు. ఎందుకంటే నా కాన్షస్‌కి నేను రాజుని. నా స్వంత ప్రపంచంలో నా కంత గుర్తింపు ఉంది, అందుకే నాకంత గర్వం కూడా. నా ఉనికిని నేనే ప్రశ్నించుకునే స్థితిలో తీసుకున్న నిర్ణయమిది..... నన్ను నేను మర్చిపోకుండా ఉండటానికి ఈ పరుగు తప్పలేదు. నా రిసెర్చికి ఫండ్స్ ఆపెయ్యమని, ఇంతవరకూ నేను చేసిన రిసెర్చ్ రిపోర్టులు ప్రభుత్వానికి సమర్పించి నన్ను సెలవలో వెళ్ళిపొమ్మని ఆదేశాలు వచ్చాయి..... కోర్టులో కేసు వేస్తే గెలుస్తాను-ఓ సంవత్సరం పోయిన తర్వాత! అప్పటికి సీతారామ శాస్త్రి బతికే ఉంటాడు గానీ ప్రొఫెసర్ పట్టాభి చచ్చిపోతాడు!"

కంఠంలో జీరని దాచుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ నవ్వాడు.

"ఎందుకో కారణం తెల్పిందా"

"ఆ స్తంభం దగ్గరాపెయ్యండి, అక్కడ చిన్న పనుంది. తెలుగువాడిని కదా-హఠాత్తుగా నా కంతటి గౌరవం వచ్చేస్తే ఆ ఆనందంతో గుండాగి చచ్చిపోతానని భయపడుంటారు. ప్చ్! పాపం తెలుగువాడు....కొన్ని బహిరంగ రహస్యాలు మనసులో దాచుకుంటేనే మంచిది, బయటకు చెప్పుకుంటే......."

పట్టాభి వాక్యం పూర్తి చెయ్యకుండానే కారు దిగి జనంలో కల్సిపోయాడు. అతడికి తెలుసు ఇంకో క్షణం గడిస్తే అంతవరకూ బలవంతంగా ఆపుకున్న ఉద్వేగం కనురెప్పలని తడిచేసి వదుల్తుందని. ●